షూటింగ్ బాల్ పోటీలకు 'శ్రీనివాస' విద్యార్థి

జయంత్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో ఈనెల 27 నుంచి 29 వరకు జరుగుతున్న జాతీయ స్థాయి జూనియర్ షూటింగ్ బాల్‌కు మదనపల్లె విద్యార్థి ఎంపికయ్యాడు. మదనపల్లె శ్రీనివాస డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతున్న జయంత్ కుమార్ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జూనియర్ నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో పోటీలో పాల్గొనకుండా విరమించుకున్నాడు. విషయం తెలుసుకున్న బిటి కాలేజ్ అధ్యాపకుడు మలిగి మధుసూధన్‌రెడ్డి నిరుపేద విద్యార్థి, నైపుణ్యం ఉన్న క్రీడాకారుడు జయంత్ కుమార్గా అండగా నిలిచాడు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాడు. నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఎంతో తోడ్పాటు అందిస్తున్న మలిగి ఫ్యామిలీకి విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తున్న మలిగి మదుసూధన్‌రెడ్డి, సోదరుడు రాఘవరెడ్డిలను కాలేజీ యాజమాన్యం అభినందించింది.

రాయచోటిలో కాల్పుల కలకలం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి
- నిందితుల కోసం పోలీసు జాగిలంతో గాలింపు
- ఘటనపై రవాణా శాఖ మంత్రి 'మండిపల్లి' ఆరా

మృతి చెందిన హనుమంతు

తీవ్రంగా గాయపడిన రమణ

జాగిలంతో గాలింపు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో కాల్పులు కలకలం సృష్టించాయి. రాయచోటి మండల పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున జరిగిన తుపాకీ కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గయపడ్డారు. కాటిమాయకుంట సమీపంలో గుడిసెలు వేసుకుని చిక్కు వెంట్రుకలు, పాతసామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సంబేపల్లె మండలం నామాలగుట్టకు చెందిన నీలకంఠ హనుమంతు(50), సల్ల రమణ(30) అనే వ్యక్తులు మాధవరం గ్రామంలోని మద్దెలకుంట గ్రామానికి వెళుతుండగా రోడ్డుపక్కనున్న గుట్టల్లోంచి గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరూ రక్తపు మరకలతో వారు నివాసం ఉంటున్న గుడిసెల వద్దకు చేరుకోగానే బంధువులు హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గుర్తుతెలియని వ్యక్తి తుపాకీతో కాల్పులు జరిపినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ కాల్పుల్లో రమణపై రెండు రౌండ్లు కాల్పులు జరపగా, హనుమంతుపై ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు డాక్టర్లు గుర్తించారు. తమకు ఎవరితో విభేదాలు లేవని, కాల్పులు ఎందుకు జరిపారో తెలియదని బంధువులు అంటున్నారు. కాల్పుల ఘటనపై రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసు జాగిలంతో ఆదివారం ఉదయం 9 గంటల నుండి కాటిమాయకుంట గ్రామ శివారు ప్రాంతంలోని గుట్టలలో క్షుణ్ణంగా పరిశీలించారు. జాగిలం కాటిమాయకుంట గ్రామానికి పడమర వైపు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి ఆగడంతో అక్కడ రక్తపు చుక్కలను గుర్తించారు. రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్, రూరల్ సిఐ తులసి రామ్, ఎస్ఐ నర్సింహారెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నరు. ఏది ఏమైనప్పటికీ తుపాకీ కాల్పులు కలకలం రేపడంతో రాయచోటి పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

కాల్పుల ఘటనపై మంత్రి 'మండిపల్లి' అరా

రాయచోటి మండలం పరిధిలోని మాధవరంలో ఇద్దరి వ్యక్తులపై కాల్పులు జరిగిన ఘటనపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. కాల్పుల ఘటనపై ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాల్పుల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

గండికోట నిర్వాసితులను ఆదుకుంటాం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

గండికోట జలాశయాన్ని పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి-కొండాపురం

గండికోట నిర్వాసితులను ఆధుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం కడప జిల్లా కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టును జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రాష్ట్రాన్ని సస్యశ్యామలం, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగక నిర్వీర్యం చేశారని, అన్ని రంగాలను అభివృద్ధి చేయక ముఖ్యంగా నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో ఇరిగేషన్ శాఖను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఎక్కడ కూడా ఇరిగేషన్‌కి సంబంధించి ఒక రిజర్వాయర్ గాని నిర్మించలేదన్నారు. ఆఖరికి లాకులు, షెట్టర్స్, డోర్స్, కనీసం తెలియని పరిస్థితన్నారు. ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేయడం అంటే వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసినట్లేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి ప్రతి ఆఖరి ఎకరా వరకు తీసుకువెళ్లాలని, తాగునీరును అందించాలని ఉద్దేశంతో ముందుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వరకు 95 శాతం రిజర్వాయర్లను నీటితో నింపామని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని చెరువులను నీటితో నింపామని చెప్పారు. వాటర్ మేనేజ్మెంట్ పర్ఫెక్ట్‌గా చేయడం వల్లనే జిల్లాలో ఉన్న 250 చెరువులను నీటితో నింపడం సాధ్యమైందన్నారు. గండికోట నిర్వాసితులకు సంబంధించి సమస్యలు, నష్టపరిహారాలు, ఆర్అండ్ఆర్ తదితరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని, రతనాల సీమగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగక పోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గండికోట నిర్వాసితులకు సంబంధించి ప్రభుత్వంతో చర్చలు జరిపి నష్టపరిహారాలను అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం గండికోట నిర్వాసితుల నుండి రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అర్జీలు స్వీకరించి తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. తొలుత మంత్రి గండికోట ప్రాజెక్టును సందర్శించి జల వనరుల శాఖ అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వనరుల శాఖ సిఇ శ్రీనివాసులు, ఎస్ఇలు మల్లికార్జునరెడ్డి, వెంకటరామయ్య, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.నాగార్జున

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నిరుద్యోగ యువతకి అందుబాటులో ఉండి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జున పేర్కొన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతపై ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్యం పెంపొందించడం ఉచితంగా శిక్షణ కల్పించడం, నిరుద్యోగ యువత జాబ్ మేళాలో యువతకు ఉద్యోగ అవకాశాలు ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లా నైపుణ్యాధికారుల సంస్థ పనివివరాలు తెలపండి?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాది కార్యాలయం ద్వార జిల్లాలోని అన్ని నియోజకవర్గంలలో ప్రతి నెల ఒక చిన్న జాబ్‌మేళా (2 లేదా 3 కంపెనీలతో) నిర్వహించి జిల్లాల్లోని నిరుద్యోగ యువతకు ప్రయివేటు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేసి అక్కడ 30 మందికి నిరుద్యోగ యువతకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశములు కల్పిస్తాం. పార్లమెంట్ నియోజకవర్గంలో స్కిల్ కాలేజి ఏర్పాటు చేసి 30 మందికి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, భోజన వసతులు కల్పించి, శిక్షణ అనతరం ఉపాది అవకాశములు కల్పిస్తాం.

నిరుద్యోగ యువతకు శిక్షణ ఎక్కడ ఇస్తారు?

నిరుద్యోగ యువతకు జిల్లా వ్యాప్తంగా రాయచోటిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మదనపల్లిలో జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, రాజంపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్ఎసి కళాశాల, పీలేరులో ఎస్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రైల్వేకోడూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తంబళ్లపల్లెలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిరుద్యోగ యువతకు శిక్షణ అందజేస్తున్నాం.

నిరుద్యోగ యువతకు ఎలాంటి శిక్షణ ఇస్తారు?

నిరుద్యోగ యువతకు జిల్లా నైపుణ్య అభివృద్ధి ద్వారా జిల్లాలోని అనే నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహిస్థాం. పార్లమెంట్ నియోజకవర్గంలో ఇ-కాలేజ్ ఏర్పాటు చేసి శిక్షణ కూడా ఇస్తాం. శిక్షణలో భోజనం వసతులు కల్పించి, శిక్షణ మాత్రం అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

శిక్షణ ఎవరి చేత అందిస్తారు? ఎక్కడ ఇస్తారు?

ఎపిఎస్ఎస్‌డిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యం అభివృద్ధి సంస్థ యొక్క ట్రైనర్లు, న్యాక్, ఫ్రీలాన్సర్లు ద్వారా శిక్షణలు ఇస్తాం. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో శిక్షణ కల్పిస్తాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా నైపుణ్య సంస్థ యొక్క కార్యాలయంలో ఎటువంటి సిబ్బంది కొరత లేదు.

నిరుద్యోగ యువతకు ఏమైనా సలహాలు ఇవ్వాలనుకుంటున్నారా?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపున్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కార్యాలయం ద్వారా జిల్లాలో జరిగే జాబ్‌మేళాలను ఉద్యోగ యువత సద్వినియోగ పరుచుకోవాలి. స్కిల్ హబ్‌లలో జరిగే ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగ పరుచుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో నర్సింగ్ చదివిన వారికి స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం పేరుఃతో సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశములు కల్గిస్తున్నాం. మరిన్ని వివరాలు కొరకు Facebook:APSSDC-Annamayya District, Instagram: apssdc_anmy, APSSDCటోల్ ఫ్రీ నెంబర్ : 9988853335 సంప్రదించవలెను.

'గురుకుల' సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ఎస్‌టి సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్ నాయక్

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, తిరిగి వారిని విధుల్లోకి ఆహ్వానించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిషన్ సభ్యులు ఒడిత్యా శంకర్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన పీలేరు పట్టణంలోని కంభంవారిపల్లి ఎస్టీ సంక్షేమ గురుకుల బాలిక పాఠశాలను సందర్శించారు. ఈ సందరరేగా ఆయన విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 36 రోజులుగా సమ్మెలో ఉన్న గిరిజన సంక్షేమ విద్యాసంస్థల ఔట్సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు హామీ ఇచ్చి విధులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా గిరిజనులు ఉన్నారని, ప్రభుత్వం వారి సంక్షేమం, అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ప్రధానంగా ప్రతి గిరిజన గ్రామానికి ప్రత్యేక గృహాల కేటాయింపుతో పాటు స్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 2014-19 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో రాష్ట్రంలోని 80 ఎస్టీ సంక్షేమ వసతి గృహాలను ఎస్టీ గురుకుల పాఠశాలలుగా అభివృద్ధి చేస్తూ జీవో జారీ చేశారని, అయితే వాటికి తగినన్ని వసుతులతో కూడిన ప్రత్యేక భవనాలు లేక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందన్న ఆవేదనను వ్యక్తం చేశారు. మరో మూడు నెలల్లో పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రస్తుతం గిరిజన సంక్షేమ పాఠశాలల్లో గత 10 నుంచి 13 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందికి డీఎస్సీలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ తగిన చర్యలు తీసుకుంటామన్న హామీతో వారు విధులకు వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కంభంవారిపల్లి మండలం జిల్లెళ్ళమంద పెద్దతాండా వాసుల భూ సమస్యను పరిష్కరించాలని, అలాగే ఆ గ్రామానికి స్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని కూడా తహశీల్దారు క్రాంతికుమార్ కు సూచించారు. అదేవిధంగా వందల ఏళ్లుగా ఆ గ్రామ ప్రజల ఆధీనంలో ఉన్న స్థలాన్ని అగ్రవరా?నికి చెందిన ఓ వ్యక్తి కబ్జాకు పాల్పడ్డాడని, దాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆ గ్రామ గిరిజనులకు అప్పగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముందుగా స్థానిక రోడ్లు భవనాలు శాఖ అతిథి గృహానికి చేరుకున్న ఎస్టీ కమిషన్ సభ్యులు ఒడిత్యా శంకర్ నాయక్ కు జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి పి. తేజస్విని, కెవి పల్లి మండల తహశీల్దారు ఎన్. క్రాంతికుమార్, స్థానిక దుర్గా గ్యాస్ ఏజెన్సీ అధినేత అమరేంద్రనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి పి. తేజస్విని, కెవి పల్లి తహశీల్దారు ఎన్. క్రాంతి కుమార్, గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. ప్రసాద రావు, ఈఓపిఆర్డి లతీఫ్ ఖాన్, విఆర్‌ఓలు హేమంత్ నాయక్, కళ్యాణి, ఇబ్రహీం సాహెబ్, రవి, సచివాలయ కార్యదర్శులు బావాజాన్, సంయుక్త, దుర్గా గ్యాస్ ఏజెన్సీ అధినేత బి.అమరేంద్ర నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, జయరాం నాయక్, హనుమాన్ నాయక్, రవీంద్ర నాయక్, నాగముని నాయక్, బాలూ నాయక్ పాల్గొన్నారు.

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి : ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, గురుకుల, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దానికి అధికారులు దృష్టి పెట్టాలని పిడిఎస్ఃయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా వసతి గృహాలలో అత్యంత అవినీతి జరుగుతోందన్నారు. స్థానికంగా వసతి గృహ అధికారులు, ఎఎస్‌డబ్ల్యూఒ, ఎబిసి అధికారులు ఉండడం లేదని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా బోగస్ హాజరు వేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంచార్జ్ వసతి గృహ అధికారులు కోసం లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకుని అత్యంత అవినీతికి పాల్పడుతున్న వసతి గృహ అధికారులను ఇన్‌ఛార్జి వసతి గృహ అధికారులు కానీ నియమిస్తున్నారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు అక్కడ పనిచేసే ప్రిన్సిపల్స్, వసతి గృహ అధికారులు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టలేదని గతంలో పనిచేసిన డిసిఒ అధికారికి ప్రతి నెల మామూలు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వసతి గృహ అధికారులకు బుధవారం సెలవైనప్పటికీ ఆదివారం కూడా అనధికారికంగా సెలవు తీసుకుంటున్నారని మండిపడ్డారు. బాలికల వసతి గృహాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేదానికి ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు సాయి నాయక్, అమీర్ పీర్, రవీంద్ర, మంజునాథ పాల్గొన్నారు.

రైతు రామమోహన్‌తో మాట్లాడుతున్న పోలీసులు

భూ సమస్య పరిష్కారానికి టవర్ ఎక్కిన రైతు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సెల్ టవర్ ఎక్కిన రైతు

రాయచోటి పరిధిలోని ఎగువ అబ్బవరం గ్రామం కొత్త కురవపల్లికు చెందిన గోవిందు రామమోహన్ అనే రైతు ఆదివారం సెల్ టవర్ ఎక్కి కలకలం సృష్టించాడు. పట్టణ పరిధిలోని మదనపల్లి రింగ్ రోడ్డు నుంచి గాలివీడు వైపు వెళ్లే దారిలో రింగ్ రోడ్డు పక్కన ఉన్న సెల్ టవర్ రామమోహన్ ఎక్కాడు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ఉన్న ప్రజలు, పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అటు ప్రజలు ఇటు పోలీసులు ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా రామమోహన్ టవర్ దిగలేదు. తనకు ఎన్నో ఏళ్ళుగా భూ సమస్య ఉందని, తన భూమి తనకు చెందకుండా గౌనిపల్లి ఆంజనేయులు అనే వ్యక్తి అడ్డుపడుతున్నారని, పలుమార్లు దాడి చేసి తనను కొట్టించారని బాధితుడు టవర్ పైనుంచి కేకలు పెడుతూ చెప్పాడు. అర్బన్ సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసుకొని భూ సమస్య పరిష్కారానికి తాము సహకరించి పరిష్కారమయ్యేలా చూస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. మీపై నమ్మకంతో దిగుతున్నానంటూ పరిష్కారం కాకుంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి టవర్ నుంచి బాధితుడు బాధిత రైతు కిందికి దిగి వచ్చాడు. వెంటనే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు.

నేడు కలెక్టరేట్‌లో క్రిస్మస్ హైటీ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకులకు హై-టీ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి షేక్ ఇమ్రాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులు, అనధికారులు, పాస్టర్లు, చర్చి మత పెద్దలు, క్రైస్తవ సోదరసోదరీమణులు, విద్యావేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

రేపు డయల్ యువర్ డిఎం కార్యక్రమం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సర్వీసులు, ఆర్టీసీ ఆదాయం పెంచడానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఈ సెల్ నెంబరు 9959225679కు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్ కుమార్

బిటి కళాశాలలో అన్ని కోర్సులు ప్రారంభించాలి : బిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని చారిత్రాత్మక బి.టి.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని కోర్సులు ప్రారంభించాలని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో వైభవంగా గొప్ప వ్యక్తులకు విద్యను అందించిన బిటి కళాశాల, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి లాంటి వ్యక్తులు చదివిన బిటి కళాశాల, రవీంద్రనాథ్ ఠాగూర్ సందర్శించి జాతీయ గీతాన్ని తర్జుమాకు వేదిక అయిన బిటి కళాశాల, 1917లో స్థాపించి నేటికి 107 సంవత్సరాల పూర్తి చేసుకున్న బిటి కళాశాల, మదనపల్లిలో అనేకమంది ప్రముఖులు చదివి నేడు పట్టణంలో విదేశాలలో డాక్టర్లుగా ఇంజినీర్లుగా రాజకీయ నాయకులుగా ఉన్నతమైన స్థానాల్లో ఉన్న వారికి విద్యను అందించిన బిటి కళాశాల నేడు శిథిలావస్థకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్‌డేటెడ్ కోర్సులు లేకపోవడంతో అడ్మిషన్లు మందగించి కళాశాల మూతపడే పరిస్థితికి రావడం బాధాకరమన్నారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్రలో మదనపల్లికి విచ్చేసిన సందర్భంగా నాలుగు హామీలను మదనపల్లికి ఇచ్చారని గుర్తు చేశారు. మదనపల్లెని జిల్లా చేస్తామని, బిటి కళాశాలను యూనివర్సిటీ చేస్తామని, మదనపల్లిలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, హంద్రీనీవా కాలువను పూర్తి చేసి రైతులకు పట్టణ ప్రజలకు నీటి కొరతను తీరుస్తామని చెప్పారన్నారు. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్న బిటి కళాశాలకు అడ్మిషన్లు లేవని, నడపలేమని చెప్పి ప్రయివేట్ పరం చేసి వారి సామాజిక వర్గానికి కట్టబెట్టే కుట్ర జరుగుతోందనే అనుమానం ప్రజల్లో ఉందన్నారు. యూనివర్సిటీ పనులను వెంటనే ప్రారంభించాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాలాజి, సహదేవ, రమణ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివ, ప్రశాంత్ పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు

- సిద్ధవటం కోట సందర్శనలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

సిద్ధవటం కోటను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటక సంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం కడప జిల్లా పర్యటనలో భాగంగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పర్యాటక అధికారులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ సిద్ధవటం కోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండో శతాబ్దం నాటి మట్లి రాజులు నిర్మించిన అద్భుతమైన సిద్ధపటం కోటలోని శివాలయం మసీదు, పరిశీలించానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారాలతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం పిపిపి మోడల్‌లో ఇన్వెస్టర్లతో ఇటీవలే సమావేశం కూడా నిర్వహించామని తెలిపారు. సిద్ధవటం కోట చుట్టూ ఉన్న దేవాలయాలను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సఫారీ, బోటింగ్, రెస్టారెంట్, సర్క్యూట్ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిద్ధవటం కోటలోని శిథిలావస్థకు చేరుకున్న వాటికి మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు బస చేసి ఇక్కడి ప్రాంతాలను సందర్శించుకునే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజలకు ఉపాధి లభిస్తోందన్నారు. జిల్లాలోని గండికోటకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సహకారం అందించిందని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో కూడా సహకారాన్ని తీసుకొని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, వెల్నెస్ టూరిజంలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం తీసుకున్నస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముందుగా సిద్ధవటం కోటలో కాలినడకన పలు ప్రదేశాలను మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రెడ్డెప్ప ఇంటి వద్ద విచారణ చేస్తున్న జయప్రకాష్

దాడికి గురైన వ్యక్తికి పరామర్శ

ప్రజాశక్తి-కలకడ

దాడికి గురైన దళిత వ్యక్తిని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయ ప్రకాష్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట్ల శ్రీనివాసులు పరామర్శించారు. మండలంలోని, ఏనుగొండపాలెం పంచాయతీ బండమీదపల్లె ఎస్‌సి కాలనీ వాసి యాకల రెడ్డప్ప పై ఇదే గ్రామానికి చెందిన మహేష్ నాయుడు, వీరాంజనేయులు నాయుడు, ప్రసాద్ నాయుడు అనే వ్యక్తులు ఈనెల 17న కులం పేరుతో దూషించి దాడి చేయడంతో 19న ముగ్గురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. ఆదివారం బాధితుడు రెడ్డప్ప స్వగ్రామం ఏనుగొండ పాలెం, బండమీదపల్లి ఎస్‌సి కాలనీకి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు రెడ్డప్ప కుటుంబాన్ని పరామర్శించారు. దాడి జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. దాడికి గల కారణాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో సమర్పిస్తామని తెలిపారు. వారి వెంట కలకడ మండల విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట నరసింహులు, ఎస్‌సి సంఘ నాయకులు గుంటూరు రవీంద్ర పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అనారోగ్యంతో బాధపడుతున్న భవన నిర్మాణ కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సలీంబాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిటిఎం పట్టణంలో నివాసముండే భవన నిర్మాణ కార్మికుడు ఈశ్వరప్పకి హఠాత్తుగా ఆరోగ్యం క్షీణించి బెంగళూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారని అన్నారు. వైద్యులు పరిశీలించి కాలు,చేయి లేపలేకపోతున్నాడని బాగవ్వాలంటే సమయం పడుతుందని చెప్పారని అన్నారు. ఈశ్వరప్పకు కార్పెంటర్ యూనియన్ నాయకులు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సలీం బాషా, బి.వేణు గోపాల్‌రెడ్డి కార్పెంటర్ యూనియన్ అధ్యక్షులు బాలకృష్ణ, కార్పెంటర్లు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ కమిటీ

ఎంఆర్‌పిఎస్ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎంఆర్‌పిఎస్ బలోపేతమే తమ లక్ష్యమని ఎంఎస్‌పి జాతీయ నాయకులు వెలగచర్ల శివయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఆదివారం మండల పరిధిలోని డిబిఎన్ పల్లెలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. డిబిఎన్ పల్లె ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా తుమ్మలూరు హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సునీల్, ఉపాధ్యక్షులుగా టి.చిన్న నరసింహులు, ఎం.నరసింహులు, కార్యదర్శిగా బి.సుధాకర్‌లను ఎన్నుకుట్లు తెలిపారు. ఎంఎస్‌పి గ్రామ కమిటీ అధ్యక్షులుగా టి.చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా టి.హరినాథ్, ఉపాధ్యక్షులుగా పి.పెంచలయ్య, ఎన్.సాంబశివ, కార్యదర్శిగా బి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.హరిప్రసాద్‌లను ఏకగ్రీంగా ఎన్నియ్యారని చెప్పారు. ఎన్నికైనవారు మాట్లాడుతూ అంబేద్కర్ కలలుగన్న సామాజిక న్యాయం , మందకృష్ణ మాదిగ ఆశయమైన ఎస్‌సి వర్గీకరణ సాధన కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. బడుగుల ఐక్యత కోసం, అభివృద్ధి కోసం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య వడ్డెర, గ్రామస్థులు టీ.పెద్ద నరసింహులు, కె.పెద్ద సుబ్బారాయుడు, కె.మహీంద్రా, పి.రెడ్డెయ్య, టి.బాబు, కె.సుబ్రహ్మణ్యం, అమరావతి, అరుణమ్మ పాల్గొన్నారు.

రజతోత్సవ వేడుకల్లో సన్మానం అందుకుంటున్న మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి

ఉత్తమ సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్స్ తరపున ఉత్తమ సేవలు అందిన ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణను సీనియర్ సిటిజన్స్ రజతోత్సవంలో ఘనంగా సన్మానించారు. విజయవాడ, సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆది వారం సీనియర్ సిటిజన్స్ 25 వసంతాల రజతోత్సవ వేడుకలు ఘనంగా జరి గాయి. సభాధ్యక్షులు బాబురావు, ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు నారాయణ మూర్తి, ఏపి రాష్ట్ర సెక్రటరీ పరమేశ్వరెడ్డి, గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఏపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మదనపల్లె కు చెందిన మునిగోపాల కృష్ణ, ఏపి ప్రివిలేజ్ కమిటిజీవిత సభ్యురాలు ధనలక్ష్మి సేవలను గుర్తించారు. శాలువ, పూలమాల, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ కోసం వేసిన సేవలను కొని యాడారు. రాష్ట్ర స్థాయిలో కను నిప్పు అనే షార్ట్ ఫిల్మ్ తీసిన ఘనత మునిగోపాలకృష్ణతో పాటు గొల్ల పూడి తిరుపతి రావు, డైరెక్టర్ రాజు, రచయిత కృష్ణమూర్తి లను ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

29న పీలేరులో నందమూరి అభిమానుల సమావేశం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో ఈనెల 29న టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్య మంత్రి నంద మూరి తారక రామారావు అభిమానుల సమావేశాన్ని నిర్వహిం చనున్నట్లు తారక రామారావు విజ్ఞాన కళాక్షేత్రం, పీలేరు అధ్యక్షులు ఎన్‌టిఆర్ నఫీఫ్ తెలిపారు. ఆదివారం పీలేరులో ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పీలేరులో ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటులో భాగంగా అభి మానుల సూచనలు, సలహాలను స్వీకరించడం కోసం ఈ సమావేశాన్ని 29న పీలేరులో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి నందమూరి అభి మానులు అందరూ హాజరై తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సమావేశం అనంతరం విగ్రహ ప్రతిష్టాపన కమిటీని కూడా ఎన్ను కోవడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు 90144 01144 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

మాట్లాడుతున్న నసీఫ్

అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం మండలంలో ఆయన స్థానిక టిడిపి నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. నిమ్మనపల్లి పంచాయతీ అడుసుపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆలయాన్ని సందర్శించారు. అనంతరం వెంగళవారి కురవపల్లిలో నూతనంగా నిర్మించిన నల్ల గంగమ్మ అమ్మవారి దేవాలయాన్ని దర్శించారు. మండలంలోని బహుదా ప్రాజెక్టు వద్ద రూ.34 లక్షల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన రోజు నుంచి అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని అన్నారు. మారుమూల గ్రామాల నుంచి పెద్ద పట్టణాల వరకు అభివృద్దే కూటమి ప్రభుత్వ అజెండా అని అన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలోనూ అవసరమైన సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలను పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పూర్తి చేశామని తెలిపారు. బహుదా ప్రాజెక్టు రైతులకు ప్రాణవాయువుగా నిలుస్తోందని అన్నారు. దీనిని అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ ప్రాజెక్టు వద్ద సుందరమైన మొక్కలతో వనాన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. బహదా ప్రాజెక్టు నిర్వహణ అధికారులు ఉండడానికి సౌకర్యవంతంగా కార్యాలయాన్ని నిర్మించడానికి, ప్రాజెక్టుకు అవసరమైన జనరేటర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. బహదా ప్రాజెక్టు కాలువలను శుభ్రపరచి మరమ్మతులు చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.34 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ పనులన్నీ ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇఇ ప్రసాద్, ఎఇ శ్రీహరిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, బహుదా నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు దేవేంద్ర రెడ్డి, డైరెక్టర్ దామోదర్ రెడ్డి, సర్పంచ్ చెంద్రాయుడు, శ్రీవాణి, టిడిపి నాయకులు ఆర్‌జె వెంకటేష్, రాజన్న, సుధాకర్‌రావు, వెంకటరమణ, మల్లికార్జున, సుధాకర, మల్లప్ప, చంద్రాయుడు, లక్ష్మన్న, రమణ, చిన్నబాబు, శ్రీనివాసులు రెడ్డి, మేష రామకృష్ణ, శ్రీపతి, ఓబుల్ రెడ్డి, నాగరాజ నాయుడు, జయన్న పాల్గొన్నారు.

బహుదా ప్రాజెక్టు వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

నందలూరు : గణిత నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గణితం దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. గణితం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, ప్రాజెక్ట్ వర్క్ మీద పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు నిర్వహించిన గణితం గురించి హాస్య నాటిక అందరిని ఆకట్టుకుంది. విద్యార్థులు స్ట్రాలతో చేసిన కోణాలు, భిన్నాలు, అగ్గిపుల్లలతో చేసిన గణిత గుర్తులు, ఆకారాలతో చేసిన గణిత రోబో ప్రాజెక్టులు అందరినీ అలరించాయి. **కలకడ:** గణిత పితామహుడు రామానుజన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రధాన ఉపాధ్యాయుడు చంగల్ రాయుడు పేర్కొన్నారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావుల్లో రామానుజన్ ఒకరిగా గుర్తింపు పొందారనీ, గణిత శాస్త్రంలో ఆయన అపర మేధావి అని అన్నారు. ఇంగ్లాండ్ లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం రామానుజన్ రాసిన గ్రంథాలను ప్రపంచానికి పరిచయం చేసిందని తెలిపారు. కేమ్ బ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ హార్డ్ ఈయన రాసిన పేపర్ వర్క్‌ను చూసి రామానుజన్‌ను సొంత డబ్బులతో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి పిలిపించుకొని ఆయన రాసిన గ్రంథాలను చూసి ప్రోత్సహించారని అన్నారు. విద్యార్థులందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని గణితంలో మంచి ప్రావీణ్యం సాధించాలని కోరారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు నాగమణి నాయక్, ఆర్ట్ టీచర్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు:** ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన గణిత మేధావులలో ఒకరు శ్రీనివాస రామానుజన్ ఒకరని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలిపారు. శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిష్కారం కానీ ఎన్నో గణిత సమస్యలకు పరిష్కారం చూపిన గొప్ప మేధావి అని పేర్కొన్నారు. పాఠ్యాంశాలలో అన్నిటికంటే గణితం రారాజు అని గణితంలో పట్టు ఉంటే మిగిలిన ఏ పాఠ్యాం శం లోనైనా రాణించవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు అపర్ణ, గీత, రాధిక, ధనుంజయమ్మ, ఎటిపి రాజ్యలక్ష్మి, నర్స్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కలకడ : రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజలకు సేవ చేయడమే అజయ్‌రెడ్డి ధ్యేయం

- ప్రజా సంక్షేమానికి సొంత నిధులు
- సచివాలయం, బస్టాండ్ నిర్మాణానికి ఉచితంగా స్థలం వితరణ

అజయ్‌రెడ్డి

ఉచితంగా ఇచ్చిన స్థలంలో నిర్మాణంలో ఉన్న బస్టాండ్

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి మండల అభివృద్ధికి ఎరపరెడ్డి అజయ్‌రెడ్డి కుటుంబం విశేషంగా కృషి చేసిందని మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ప్రజలకు తాగునీరు, సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారని అన్నారు. అజయ్‌రెడ్డి వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని మండలంలో వైసిపి బలోపేతనానికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. అజయ్‌రెడ్డి తండ్రి కే.శే.వై.రవీంద్రరెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఆయన హయాంలో జడ్‌పి హైస్కూల్‌లో చదివే పేద విద్యార్థుల కోసం ఎంకెఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసి ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం కల్పించారని అన్నారు. తన తండ్రి లాగే అజయ్‌రెడ్డి కూడా ఈడిగపల్లె గ్రామ సచివాలయ నిర్మాణానికి తన సొంత స్థలాన్ని అందించారని తెలిపారు. మండల ప్రజలు బస్టాండ్ లేకుండా ఇబ్బందులు పడుతుండటంతో బస్టాండ్ నిర్మాణం కోసం సొంత స్థలాన్ని ఇచ్చారని, నిర్మాణ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని అన్నారు. తిరిగి మండలాభివృద్ధి జరగాలంటే నారా యణరెడ్డి కుటుంబ సభ్యులు ప్రజాప్రతినిధులుగా ఎంపికైన అయితే తప్ప మండలాలు అభివృద్ధి కాదని పేర్కొన్నారు. గతంలో జడ్‌పిటిసిగా, సర్పంచ్‌గా ఉన్న ఎరపరెడ్డి జయమ్మ గతంలో గ్రామాలోల సిసిరోడ్లు వేయిం చారని అన్నారు. తాగునీరు , సిసిరోడ్లు, డ్రెయినేజీ కాలవల సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే అధికారులకు ఫోన్ చేసి సమస్యను తక్షణమే పరిష్కారం అయ్యేలా చూసే వారని అన్నారు. అజయ్‌రెడ్డికి మండలంలోని వైసిపి కార్య కర్తలు, పార్టీ నాయకులపైన మంచి అవగాహన ఉందని ఏ విషయమైనా శాంతభావంతోనే సమస్యలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తారని అన్నారు. అలాంటి నాయకడు ప్రజాక్షేత్రంలో ఉంటే మండలం అభివృద్ధి చెందుతుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

90 శాతం నీటి సమస్యకు పరిష్కారం : మంత్రి

ప్రజాశక్తి రాయచోటి

నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డి పల్లె, రామాపురం, చిన్నమండెంలో దాదాపు 90 శాతం నీటి సమస్య పరిష్కరించడం జరిగిందని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజ కవర్గంలోని ఆరు మండలాలలో ఇప్పటివరకు 150 బోర్లు వేసి గ్రామాలకు నీటి సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామానికి నీటి సరఫరా చేసి శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం గాలివీడు మండలం, గుండ్లచెరువు గ్రామంలో వేసిన బోరులో పుష్కలంగా నీరు పడడంతో ఆ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మంచినీటి సమస్య, డ్రెయినేజీ కాలువలు, సిమెంట్ రోడ్లు, నిర్మించి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. సిఎం చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి ప్రజల సమస్యలు పరిశీలించడం జరుగుతుందన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతి నిధులు, ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మౌలానా అల్లామా ఖమ్రుద్దీన్ సాహెబ్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సహారన్‌పూర్ జిల్లా పరిధిలోని దారుల్ ఉలూమ్ దేవ్ బంద్ అరబిక్ యూనివర్సిటీ సీనియర్ లెక్చరర్ మౌలానా అల్లామా ఖమ్రుద్దీన్ సాహెబ్ షేక్ సాని గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఢిల్లీ లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. దేవ్ బంద్ యూనివర్సిటీలో మౌలానా అల్లామా ఖమ్రుద్దీన్ సాహెబ్ షేక్ సాని దగ్గర అరబిక్ చదువుకున్న విద్యార్థులు రాయలసీమలో దాదాపు 80 శాతం ఉలమాలు, ముఫ్తీలు,ఖాజీలు ఉన్నారు. ఖమ్రుద్దీన్ మృతి వార్త వినగానే పట్టణ ప్రముఖ ముస్లిం మైనార్టీలు కె. ఇందాదుల్లాఖాన్ ఖాస్మీ, ముఫ్తీ అబ్దుల్ గఫూర్ ఖాస్మీ, ముఫ్తీ అక్బర్,బహాదీ,ఖారీఫజల్ ఖాస్మీ, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఖమ్రుద్దీన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

- సబ్ యూనిట్ వైద్య అధికారి సిద్దయ్య

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ డివిజన్ వైద్యాధికారి సిద్దయ్య అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహయి-3 ను సందర్శించి విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి ద్వారా ఇన్ఫెక్ట్ అయిన ఆడ అనాఫిలిస్ అనే దోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. డెంగ్యూ వైరస్ ఇన్ఫెక్ట్ అయిన దోమకాటు తరువాత 3 నుండి 14 రోజుల లో రావచ్చుని తెలియజేశారు. మెదడువాపు ఇది కూడా ఒక వైరస్ వల్ల కలిగే వ్యాధి వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన క్యూలెక్స్ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. 2 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలలు ఈ వ్యాధి బారినపడే అవకాశాలు ఎక్కువ అన్నారు. దోమ కాటు కు గురైన నాలుగు నుంచి ఆరు రోజులకు లక్షణాలు కనిపిస్తాయని వివరి ంచారు. వ్యాధులకు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్ర మంలో వసతి గృహ సంక్షేమ అధికారులు రవీంద్రబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాదుడు ప్రభుత్వం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం బాదుడు ప్రభుత్వంగా తయారైందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ప్రజలను అనేక విధాలుగా బాదడం ప్రారంభించిందని చెప్పారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై రూ 15,485 కోట్ల అదనపు భారం మోపిందని చెప్పారు. జనవరి 1 నుంచి గ్రామాలు, పట్టణాలు, నగరాలలో భూములు, నివాస, వాణిజ్య భవనాలు,అపార్టుమెంట్లు, ప్లాట్లపై దాదాపు 20 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు భారం మోపుతున్నట్లు చెప్పారు. పట్టణాలు, నగరాలలో మంచినీటి సరఫరా మీద యూజర్ ఛార్జీల భారం త్వరలో మోపుతారని చెప్పారు. 5 శాతానికి మించి జిఎస్‌టి స్లాబులో ఉన్న వస్తువుల రవాణాపై 1 శాతం వరద సెస్సు విధించాలని రాష్ట్ర ప్రభుత్వం రాజస్థాన్‌లో జరిగిన జిఎస్‌టి 55 వ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించిందని తెలిపారు. ప్రజా పీడిత ప్రభుత్వమని మండిపడ్డారు. గండికోట రిజర్వాయర్ కిందకొండాపురం, ముద్దనూరు మండలాల్లో 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. జిల్లాలో వామి కొండ సాగర్, సర్వరాయ సాగర్ తదితర ప్రాజెక్టుల కింద ఉప కాలువలు, పంట కాలువలు లేని కారణంగా ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

తొలగించిన ఆక్రమణలు

ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు పట్టణంలో గేటు వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ప్రభుత్వ, ఆర్‌అండ్‌బి స్థలాన్ని కొందరు గత 30 సంవత్సరాల నుంచి ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకొని జీవ నోపాధి చేసుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అటు ప్రభుత్వంగానీ, పాలకులుగానీ స్పందించ లేదు. ఎట్టకేలకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు పోలీసులు సహకారంతో శుక్రవారం ఒకవైపునున్న ఆక్రమణ మాత్రం తొలగించారు. నూలువీడు, రాయచోటి, అరవీడు వైపు ఉన్న ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్డులను రెవెన్యూ అధికారులు తొలగింపజేశారని, కానీ అటు వైపు మూడు ప్రాంతాల్లో పక్కా భవనాలు నిర్మించుకున్నారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకోని ట్రాఫిక్‌అంతరాయం కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. సర్వేనెంబర్ 22 66లో మొత్తం ఎకరా 80 సెంట్లు కాగా అందులో ఇప్పటికే 11 మందికి నోటీసులు ఇచ్చారు. తహశీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ మిగతా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారికి కూడా నోటీసులు అందించి, ఆక్రమణలు తొలగిస్తామని పేర్కొన్నారు.

సర్పంచ్ శ్రీవాణి దంపతులను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న షాజహాన్‌బాషా

టిడిపిలో చేరిన వైసిపి సర్పంచ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి మద్దతుదారులైన సర్పంచ్ జి.శ్రీవాణి దంపతులు తెలుగు దేశం పార్టీలో చేరారు. ఆదివారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బహుదా ప్రాజెక్టు వద్ద వైసిపి మద్దతుదారులైన వెంగంవారిపల్లి గ్రామ సర్పంచ్ జి.శ్రీవాణి, తన భర్త నవీన్‌తో కలసి స్థానిక టిడిపి నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులరెడ్డి, ఆర్‌జె వెంకటేష్, రాజన్న, ఇతర నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే టిడిపి కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మదనపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా కూడా ఎమ్మెల్యే విరివిగా అభివృద్ధి పనులను చేపడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులవుతూ, వెంగంవారిపల్లి గ్రామాన్ని కూడా అభివృద్ధి చేసుకోవడానికి ఆకాంక్షించి తాము టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఇకపై తన గ్రామంలో కూడా విరివిగా అభివృద్ధి పనులను చేపడతామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జున, రాజన్న, శ్రీనివాసులరెడ్డి, మాజీ జెడ్పిటిసిలు సుజాత, రెడ్డప్ప రెడ్డి, సుధాకర, ఓబుల్ రెడ్డి, రమణ, సుధాకర్ రావు, శ్రీపతి, చంద్రాయుడు, లక్ష్మన్న, తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును అందుకుంటున్న రాఘవేంద్ర వర్మ

షటిల్ బ్యాడ్మింటన్ విజేత కానిస్టేబుల్ వర్మ

ప్రజాశక్తి-నందలూరు : విజయవాడలోని ఎస్ఎల్‌వి అమరావతి గ్రాండ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సౌత్ ఇండియా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో స్థానిక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్ర వర్మ విజేతగా నిలిచాడు. టిడిపి సీనియర్ నాయకులు అశోక్ గజపతిరాజు నుంచి వర్మ ట్రోఫీ, చెక్కును అందుకున్నారు. స్థానిక క్రీడాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

గాండ్ల తెలికుల సంఘం జిల్లా యువజన కన్వీనర్‌గా ఉదయ్ కుమార్

ప్రజాశక్తి-పీలేరు : అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా యువజన విభాగం కన్వీనర్‌గా పీలేరు చెందిన ఉదయ్ కుమార్ ఎంపికయ్యారు. ఆదివారం నెల్లూరులో జరిగిన సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ గాండ్ల తెలుకుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.తన ఎన్నికకు సహకారాలు అందించిన గాండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు బండపల్లె వెంకటరమణ, ఎంవి రమణలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

రిటైర్డ్ అధ్యాపకుడి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉంటున్న మాజీ రిటైర్డ్ అధ్యాపకుడు నాగూరు వెంకటరెడ్డి ఈనెల 18 నుంచి కనిపించడం లేదని అతనిభార్య దుగ్గసాని వెంకటలక్ష్మి ఆదివారం ఉదయం రామాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. వెంకటరెడ్డి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనికి మతిస్థిమితం సరిగా లేక మాత్రలు వాడుతూ ఉంటాడని, ఆచూకీ తెలిసినవారు రామాపురం పోలీసు స్టేషన్‌కు తెలపాలని కోరారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆర్‌టిసి బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. అమ్మచెరువు మిట్టకు చెందిన నారాయణ కుమారుడు నిఖిల్, కురబలకోట మండలం, దాదంవారిపల్లికి చెందిన ఇర్ఫాన్ (20)లు మిట్స్‌లో బిటెక్ చదువుచున్నారు. ఇద్దరు కలిసి ఆదివారం పుంగనూరు రోడ్డులోని ఓ డాబాకు వెళ్లి భోంచేసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యంలోని బసినికొండ గంగమ్మగుడి వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. వీరిలో నిఖిల్ పరిస్థితి విషమంగా ఉంది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.